## ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష

- వలంటీర్లకు, అధికారులకు, విధి విధానాలు ఖరారు
- టూర్ డైరీ విడుదల
- జూలై 1 నుంచి 24 వరకు కార్యక్రమం

**నక్కపల్లి:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సిపి ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో వచ్చే నెల ఒకటో తేదీనుంచి మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఈ కార్యక్రమం ద్వారా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ, మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రతి ఇంటికి తిరిగి వారి సమస్యలు తెలుసుకుంటూ వెంటనే పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుంది. ముందుగా వారం రోజుల పాటు గ్రామస్థాయి అధికారులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటారు. వలంటీర్ల వద్ద ఉన్న ఫోన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఫారాలు నింపాల్సి ఉంటుంది.

ఈ కార్యక్రమంలో ప్రధానంగా కుల ధ్రువీకరణ ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, మరణ, జనన ధ్రువపత్రాలు జారీ, వివాహ ధ్రువీకరణ పత్రాలు కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ పత్రాలు మ్యూటేషన్‌కు సంబంధించిన లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం పంట సాగు హక్కుపత్రాలు జారీ వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాని ఆదేశించింది. కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఎంఎల్‌వోలకు శిక్షణ ఇవ్వాలి. తర్వాత వీరంతా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కావాల్సిన పత్రాలను లబ్ధిదారుల నుంచి సేకరించాలి. వారం రోజుల తర్వాత మండల స్థాయి అధికారులు ప్రతి సచివాలయంలో ఒకరోజు ఉండి అక్కడికక్కడే పథకాల సమస్యలను పరిష్కరించి పత్రాలు జారీ చేస్తారు. ప్రతి ఇంటిని సందర్శించిన సమయంలో వలంటీర్ వద్ద ఉన్న ఫోన్‌లో ఉన్న యాప్‌లో ఫారం నింపాల్సి ఉంటుంది. వారికి పాకెట్ కేలండర్ ఇవ్వాలి. వారి నుంచి పత్రాలు సేకరించాలి. పత్రాలను సచివాలయంలో అందజేసి టోకెన్ తీసుకోవాలి. దరఖాస్తు దారుడి ఫోటోను అప్‌లోడ్ చేయాలి. సచివాలయంలో తీసుకున్న టొకెన్ నంబరు దరఖాస్తు దారుడికి ఇవ్వాలి.



జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**క్యాంపు రోజు ప్రక్రియ...**

సచివాలయంలో మండలస్థాయి అధికారులంతా క్యాంపు నిర్వహించిన రోజున సమస్యలు ఉన్న వ్యక్తులను క్యాంపు వద్దకు తీసుకు రావాలి. టోకెన్ నంబరు సమర్పించేందుకు సహకరించాలి. మండల స్థాయి అధికారి వద్దకు తీసుకెళ్లాలి. సమస్య పరిష్కరిస్తూ ఆమోదించిన పత్రాలు అందజేయాలి. ఇతర ఫిర్యాదులకు సంబంధించి జగనన్నకు చెబుదాం హెల్ప్‌డెస్క్ వద్దకు వారిని తీసుకెళ్లి సమర్పించాలి.

గ్రామాల్లో మండల స్థాయి అధికారులంతా కలసి క్యాంపు నిర్వహించే తేదీలను ముందుగానే గ్రామాల్లో తెలియజేయాలి. ఈ విషయాన్ని వలంటీర్లు తెలియజేయాలి. ఇంటికి తాళం వేసి ఉంటే మరో రెండు మూడు పర్యాయాలు అదే ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని తెలియజేయాలి. యజమాని అనుమతితో అతని చిత్రాన్ని జియోట్యాగ్ చేయాలి.

**నక్కపల్లి మండలంలో రెండు బృందాలు ఏర్పాటు**

జగనన్న సురక్ష కార్యక్రమం కోసం ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఈవోపీఆర్‌డీ ఒక బృందంగాను (టీమ్1) ఎంపీడీవో డిప్యూటీ తహసీల్దార్ ఒక బృందంగాను(టీమ్2) ఏర్పడి వచ్చే జూలై ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తారు. ఒకటో తేదీన టీమ్ 1 కాగిత, టీమ్ 2 వేంపాడులోను, 3వ తేదీన టీమ్ 1 డీఎల్‌పురం, టీమ్2 ఉద్దండపురం, 5వ తేదీన టీమ్1 చందనాడ, టీమ్2 దేవవరం, 7వ తేదీన టీమ్1 అమలాపురం, టీమ్2 గొడిచర్ల, 10వ తేదీన టీమ్1 జానకయ్యపేట, టీమ్2 దొంకాడ, 12వ తేదీన టీమ్ 1 జానకయ్యపేట 2 టీమ్ 2 చినదొడ్డిగల్లు1, 14వ తేదీన టీమ్1 పెదతీనార్ల, టీమ్2 చినదొడ్డిగల్లు 2, 17వ తేదీన టీమ్1 నక్కపల్లి 1, టీమ్2 దోసలపాడు, 19వ తేదీన టీమ్1 నక్కపల్లి2, టీమ్2 పెద దొడ్డిగల్లు, 21వ తేదీన టీమ్1 ఉపమాక, టీమ్2 గుల్లిపాడు, 24వ తేదీన టీమ్1 బంగారయ్యపేట, టీమ్2 రాజయ్యపేట సచివాలయాల్లో మండల స్థాయి అధికారులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి క్యాంపులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభకు పట్టం



ఖాజీపాలెంలో విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ పీలానరసింగరావు, ఎంపీటీసీ ధనలక్ష్మి



విద్యార్థులకు ఆణిముత్యాలు ప్రోత్సాహక నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ కాకర దేవి

**యలమంచిలి (అచ్యుతాపురం) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన గొప్ప బహుమతి జగనన్న ఆణిముత్యాలు పథకం అని ఖాజీపాలెం సర్పంచ్ పీలా నరసింగరావు అన్నారు. బుధవారం మండలంలో ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు షేక్ నియాజ్ అహ్మద్, కర్రి హేమ దుర్గ వర్షిణ, పీలాపావనిలను ఆయన ఎంపీటీసీ పీలా ధనలక్ష్మితో కలసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అప్పికొండ ప్రసాద్, వైస్ చైర్మన్ ఆళ్ల జ్యోతి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆణిముత్యాలుకు నగదు పంపిణీ**

**ఎస్.రాయవరం :** ప్రభుత్వం అందిస్తున్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెరుగుతోందని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. చిన్నగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆణిముత్యాలు ప్రోత్సాహక నగదు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనన చేసి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్నారు. సర్పంచ్ గాడి అప్పల నరసింహ,వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోవిందు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల వల్ల అనర్థాలు

**నక్కపల్లి:** బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు వస్తాయని, అందువల్ల బాల్య వివాహాలను అడ్డుకోవాలని దేవవరం సర్పంచ్ గొర్ల రాఘవకుమారి అన్నారు. బుధవారం సీడ్ ఆర్గనైజేషన్, సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని దేవవరంలో ఆమె ప్రారంభించారు. ఉపాధి పనులు చేస్తున్న మహిళా కూలీలతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. విశాఖపట్నానికి చెందిన సీడ్ ఆర్గనైజేషన్ వారు బాల్యవివాహల నిర్మూలన కోసం చేస్తున్న కృషిని అభినందించారు.

## క్లుప్తంగా

### కూర్మావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు



కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

**మునగపాక :** బలరామ సుభద్రా సమేత శ్రీ జగన్నాథస్వామి బుధవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగులాపల్లి, మునగపాక ప్రాంతాల్లో జగన్నాథుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. 29న ఉత్సవం నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీలు చర్యలు చేపడుతున్నారు.

### పాటిపల్లి మోడల్ స్కూల్లో మిగుల సీట్లకు 26న ప్రవేశపరీక్ష

**మునగపాక :** పాటిపల్లి మోడల్ స్కూల్లో 7,8,9 తరగతులకు సంబంధించి మిగుల సీట్ల భర్తీకి విద్యార్థుల వివరాల నమోదుతోపాటు పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రతిభ, రిజర్వేషన్లు అనుసరించి సీట్లను భర్తీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌ను సంప్రదించాలని శ్రీ లక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య పరీక్ష జరుగుతుందని తెలిపారు.

### పందూరులో గడప గడపకు నేడు

**కోటవురట్ల :** పందూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక సమస్యలు వివరించేందుకు గ్రామస్తులు సిద్ధంగా ఉండాలని, అధికారులు ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని సూచించారు.

### లింగరాజుపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు శక్తిప్రియ

**ఎస్.రాయవరం :** ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌తో వైద్య సేవలు గ్రామ స్థాయిలో అందుతున్నాయని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ అన్నారు. లింగరాజుపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించి వైద్య శిబిరంలో సుమారు 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### జగనన్న ఆణిముత్యాలుకు అభినందన



ఆణిముత్యాలకు నగదు, ప్రశంసా పత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

**పాయకరావుపేట :** పట్టణంలో గల కెహెచ్ వాడ హైస్కూల్లో చదివిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులకు జెడ్పీటీసీ లంక సూరిబాబు చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందించారు. 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థి కె.ఏసుబాబుకు రూ.3వేలు, సెకండ్ వచ్చిన విద్యార్థి ఎన్.రాజేష్‌కు రూ.2వేలు నగదు, ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, నాయకులు తాటిపాక లోవరాజు పాల్గొన్నారు.

### ఊరించిన మేఘాలు

**రాంబిల్లి:** మండలంలో పలు గ్రామాల ప్రజలు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. బుధవారం ఆకాశం మేఘావృతమైనప్పటికీ వర్షం మాత్రం పడలేదు. దీంతో రైతులు నిరాశ పడ్డారు. మరో పక్క సాయంత్రం 4 గంటల వరకు ఉక్కబోత కొనసాగింది. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమైంది. వరుణుడు ముఖం చాటేస్తుండడంతో ఖరీఫ్ పనుల కోసం ఎదురు చూస్తున్న రైతులు నిరాశ చెందుతున్నారు.

## జగనన్న సురక్షతో సమస్యలకు చెక్

**కోటవురట్ల :** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాల జారీలో అడ్డంకులు తొలగిపోతాయని, సత్వర పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ అన్నారు. కైలాసపట్నం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ మండలంలో కైలాసపట్నం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు అందుతాయని తెలిపారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువపత్రాలు, మ్యుటేషన్, టైటిల్‌డీడ్, పట్టాదారు పాస్ పుస్తకాలు, వివాహ ధ్రువపత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇలా 11 రకాల ధ్రువపత్రాలకు సంబంధించి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ నెల 24 నుంచి వలంటీర్లు వారి క్లస్టర్ పరిధిలో ఇళ్ల సందర్శన, సచివాలయాల స్థాయిలో జూలై 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి 11 రకాల సేవలపై అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. వీటికి ఎటువంటి రుసుము ఉండదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసీల్దారు జానకమ్మ, ఏవో చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణం, సర్పంచ్ పెన్నాడ నూకరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కైలాసపట్నం సచివాలయంలో అధికారులకు వివరిస్తున్న ప్రత్యేక అధికారి ఉదయశ్రీ

## క్విజ్ విజేతలకు ప్రశంసా పత్రాలు

**ఎస్.రాయవరం :** ఆర్‌బీఐ మండలస్థాయి క్విజ్ కాంపిటేషన్‌లో కొరుప్రోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు యశ్వంత్, గోవర్ధన్‌లు ప్రథమ స్థానంలో నిలిచినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.పురుషోత్తమరావు తెలిపారు. బుధవారం ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల నుంచి 10 వ తరగతి చదువుతున్న యశ్వంత్, 8 వ తరగతి చదువుతున్న గోవర్ధన్ పాల్గొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఇరువురు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి ఎస్‌బీఐ సంస్థవారు రూ. 5 వేలు నగదు బహుమతి అందజేసినట్టు చెప్పారు. ఈ మేరకు ఈ విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.



క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

## ప్రత్యామ్నాయ విత్తనాలపై దృష్టి సారించాలి

**నక్కపల్లి :** రైతులు విత్తన శుద్ధి పాటిస్తూ ప్రత్యామ్నాయ విత్తనాలు వేసే విధానంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ అన్నారు. బుధవారం కాగిత, గుల్లిపాడు గ్రామాల్లో రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి వల్ల భూమికి పారగమ్యత పెరిగి ఆక్సిజన్ అందడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి వరిలో తెగుళ్ల నివారణకు దోహదపడుతుందన్నారు. మన ప్రాంతానికి అనుకూలం అయినప్పటికీ శ్రీకాకుళం సన్నాలు, ఆర్‌జీఎల్ 2537, సాంబ మసూరి బిపిటీ 5204 పాత రకాలు అవడం వల్ల చీడలు, తెగుళ్లు ఎక్కువై దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. అందువల్ల రైతులు కొంత వరకు వరిలో ప్రత్యామ్నాయ కొత్తరకాలైన స్వర్ణకి ప్రత్యామ్నాయంగా ఎంటియు 1318, సాంబ మసూరికి ప్రత్యామ్నాయంగా ఎంటియు1224, ఆర్‌జీఎల్‌కు బదులు ఎంటియు 1061(ఇంద్ర), ఎంటియు 1064 (అమర)వంటి కొత్త మారేటరు రకాలు ఎంచుకోవాలని సూచించారు.



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## వర్షాలు కురవాలని...కప్పా కప్పా నీలాలు

**మునగపాక :** వరుణ దేముడు కరుణించాలని కోరుతూ మునగపాక రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కప్ప కప్ప నీలాల ప్రదర్శన నిర్వహించారు. కొద్ది రోజులుగా ఎండలు తప్ప వర్షాలు కురవకపోవడంతో పంటపొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతు సంఘం ముందుకొచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలు కురవాలని కప్పలతో సేవగరిడీలతో ఊరేగింపు నిర్వహించారు. రైతు సంఘం అధ్యక్షుడు ఆడారి మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, రైతులు వేగి కృష్ణ, బొడ్డేడ రామారావు, వెలగా వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కప్ప కప్ప నీలాలు ప్రదర్శన

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

**మునగపాక :** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ప్రభుత్వం కల్పిస్తుందని ఎంఈవో వేణుగోపాలరావు అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మునగపాక దళితవాడలో విద్యార్థుల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. నలుగురు ఉన్న విద్యార్థులను 20 మందికి పెంచిన ఉపాధ్యాయుడు శివకోటి దుర్గా ప్రసాద్‌ను అభినందించారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను అందజేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు, వార్డు సభ్యులు లక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాలరావు

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**యలమంచిలి :** మత్తు పదార్థాలు వినియోగం ఆరోగ్యానికి హానికరం అని యలమంచిలి ఎక్సైజ్ ఎస్ఐ గణేష్ అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణంలోని సూర్య ఐటీఐ కళాశాలలో డ్రగ్స్ గంజాయి, మాదక ద్రవ్యాలు వినియోగంపై వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, గంజాయి మత్తు పదార్థాలు ఎవరైనా వినియోగించినా, రవాణా చేసినా చట్టరిత్యా శిక్షార్హులు అని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ అధికారులు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గణేష్

## వాడవాడలా యోగా దినోత్సవం



వేంపాడులో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మణిరాజు



నక్కపల్లి కేజీబీవీలో యోగాసనాలు వేస్తున్న బాలికలు

**నక్కపల్లి :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం వాడ వాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. నక్కపల్లి కేజీబీవీ పాఠశాల, వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయుర్వేద డిస్పెన్సరీ, వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా వేడుకల్లో విద్యార్థులు చేసిన కార్యక్రమాలు అలరించాయి. ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌కుమార్, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సర్పంచ్ ఏడిద నూకరత్నం హెచ్‌ఎం నర్సింగరావు యోగా ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. యోగా పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

**యలమంచిలి :** ఏటికొప్పాక సచివాలయంలో యలమంచిలి మండల జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త రాము ఆధ్వర్యంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం పొంది షుగర్ వంటి వ్యాధులు బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, యోగాభ్యాసంతో మనస్సు ఏకాగ్రతగా పనిచేస్తుందని అన్నారు. ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక యోగ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అచ్చియనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు, ఏటికొప్పాక సచివాలయ కన్వీనర్ దిమిలి రమణబాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వెలుగు ఏపీఎం రాణి పాల్గొన్నారు.

**అచ్యుతాపురం సెజ్‌లో**

**యలమంచిలి (అచ్యుతాపురం) :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవనం సాగించవచ్చునని పిల్‌కింటన్ పరిశ్రమ జీఎం సుకుమార్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా పిల్‌కింటన్ పరిశ్రమలో సిబ్బంది, ఉద్యోగులు యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేసి యోగ ప్రాముఖ్యతను గుర్చి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ జీఎం సుకుమార్ మట్లాడుతూ పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు నిత్యం యోగ సాధన చేయాలని యోగ సాధన ద్వారా శారీరక ధృఢత్వం, మానసికంగా ఆరోగ్యంగా ఉల్లాసంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ మేనేజరు లెనిన్‌బాబు, హెచ్‌ఆర్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

**పేట బయ్యవరంలో...**

**యలమంచిలి :** యోగా మానసిక శారీరక ప్రశాంతతకు ఎంతో తోడ్పడుతుందని పతంజలి యోగ శిక్షకుడు పొలమరశెట్టి శంకరావు అన్నారు. మండలంలో పేట బయ్యవరం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సూర్య నమస్కారాలు, ఆసనాలు వేయించారు. గ్రామంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా శిక్షకులు తాటికొండ రామకృష్ణ, ఎ.సత్యనారాయణ, బ్రహ్మానందం యోగపై పలువురికి శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏటికొప్పాక లో యోగా డే వేడుకల్లో పాల్గొన్న నాయకులు సేనాపతి రాము, వైద్యాధికారులు

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**

**ఎస్.రాయవరం :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారవచ్చని కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యులు సుజాత అన్నారు. కొరుప్రోలు గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి గ్రామ పెద్దల ఆయుర్వేదిక్ వైద్య సిబ్బంది యోగా డే నిర్వహించారు. యోగ ప్రయోజనాలు వివరించారు. యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతంత లభించడమే కాకుండా ఆరోగ్యకరంగా ఉండవచ్చన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమరావు పాల్గొన్నారు.

**యోగాతో మానసిక ప్రశాంతత**

**మునగపాక :** యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు విజ్ఞానం పెరుగుతుందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మళ్ల కాళేశ్వరరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం యోగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలురకాల ఆసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యం బాగుపడి ప్రజలు ఉత్సాహంగా ఉండవచ్చన్నారు.



యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



సెజ్‌లో పిల్‌కింటన్ కంపెనీలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది



యోగాపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కాళేశ్వరరావు

## చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

**మునగపాక :** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో వేణుగోపాలరావు కోరారు. మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు దీక్షిత్, మనోజ్ కుమార్‌లు ఆర్‌బీఐ ఆల్ ఇండియా క్విజ్ పోటీల్లో ఫైనాన్సియల్ లిటరసీ 2023 అంశానికి సంబంధించి మండలస్థాయిలో ప్రతిభ చూపారు. వారికి రూ.5వేల నగదుతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్లో ఇద్దరు విద్యార్థులను అభినందించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పథకంపై అవగాహన

**మునగపాక :** జగనన్న సురక్ష పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మండలంలోని వెంకటాపురం సచివాలయంలో బుధవారం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఇంకా అందలేని వారిని గుర్తించి వారికి ఆగస్టు నుంచి పథకాలు అందేలా చూడాల్సి ఉందన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో మన్మథరావు,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పాలిమేర గణేష్, ఎంఎల్ఓ సంజయ్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మోహిని పాల్గొన్నారు.

**రాంబిల్లి:** జగనన్న సురక్ష కార్యక్రమంపై పలు గ్రామాల్లో బుధవారం అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కొండలరావు ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

**జగనన్న సురక్షపై దృష్టి సారించాలి**

**పాయకరావుపేట :** ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అందరూ కూడా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఎ.సాంబశివరావు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారి వివరాలు నమోదు చేసి, ప్రభుత్వానికి పంపించాలన్నారు. మండలంలో గల శ్రీరాంపురం గ్రామంలో ఈ మేరకు బుధవారం ఎంపీడీవో, 9 సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.

## కౌలు రైతులను గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేద్కర్

**నక్కపల్లి :** మండలంలో వివిధ గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ చురుగ్గా చేపట్టాలని తహసీల్దార్ అంబేద్కర్ ఆదేశించారు. బుధవారం ఆయన వీర్వోలు, వీఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు, ఈ క్రాప్ నమోదు పక్కాగా చేయాలన్నారు. సాగు భూముల్లోకి వెళ్లి రైతులు, కౌలు రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాల్సి ఉందన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీఆర్వోలు క్షేత్ర స్థాయి పర్యటనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎక్కడో ఒక చోట కూర్చొని పంట నమోదు, కౌలు రైతుల వివరాలు నమోదు చేస్తే తర్వాత వచ్చే సమస్యలు ఫిర్యాదులకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చే సమస్యలు, వెంటనే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాల జారీ కూడా వేగవంతంగా ఉండాలన్నారు.